# అరుంధతి



'విశ్వభరత్'

అరుంధతి నిర్లిప్తంగా నవ్వింది...!

అసలు అరుంధతికి అలా నిర్లిప్తంగా నవ్వడం అలవాటయిపోయింది . . . కాదు, నేర్చుకొంది!

అరుంధతి నవ్వితే అరవిందాలు విరబూసినట్లుండేదని అనే వారందరూ ప. . .ఈ నాడు అరుంధతి నవ్వు ఏ విధంగానూ అనిపించడం ఆమె కూడా పూర్వంలా అందర్నీ ఆనందించేలా, మురిపించేలా నవ్వలేక పోతూంది. నవ్వాలనీ, నలుగురిలా మన సంతా ఆనందంతో నిండిపోగా నవ్వాలనీ ఆమెకు అనిపించడం లేదు.

"అరూ, నువ్వు నవ్వితే ఈ లోక మంతా వెన్నెలతో నిండిపోతూన్నట్లు అనిపిస్తుంది!" అనేవాడు శేఖర్.

"అరుంధతీ! మీరు నవ్వితే అరవిందాలు విరబూసినట్లుంటుంది! సదా మీ నవ్వు చూస్తూ ఉండిపోవా లనిపిస్తుంది. నాకాఅవకాశంఇవ్వరూ?" ప్రార్థించేవాడు సుధాకరం.

"అమ్మా! అరుంధతీ! నీ నవ్వే నమ్మా ఈ ఇంటికి వెలుగు"అనేవాడు తండ్రి.


నిజంగానే అరుంధతి నవ్వు అందంగా ఉండేది. ఆమె పకపక నవ్వితే సెలయేటి గలగలల సంగీతం వినిపిం చేది. నవ్వుతూన్నప్పుడు ఆమె బుగ్గల మీద రెండు పక్కలా చిన్న సొట్టలు పడేవి. నవ్వు ఆగిపోయినా రెండు క్షణాల వరకూ ఆ సొట్టలు నిలిచి పోయేవి. అరుంధతి నవ్వితేనే అందంగా ఉండేదా? కాదు, గంభీరంగా ఉన్నా మూర్తీభవించిన సౌందర్యప్రతీక ఆమె!

విధికి ఏదో ఒక జీవితంతో ఆటాడు కోవటం అలవాటు కావచ్చు. కాని అందుకు అరుంధతి జీవితమే కావాలా? ఆ ఆటలో విజయం చేపట్టిన విధి వికటాట్టహాసం చేస్తూనే ఉంది ఇంకా! ఫుట్‌బాల్ ఆటగాడు ఆటలో గెలిచిన సంతోషంతో బంతిని ఊరికే తన్నుతుంటాడు. విధీ అంతే! అరుంధతి ఓడిపోయినా అప్పుడప్పుడు ఆమె శిథిల జీవితంతో ఆడుకోవటం మానలేదు!

అరుంధతికి ఓడిపోవడం అలవాటయి పోయింది. గెలుస్తాననీ, గెలవాలనీ అనుకొనేది కాదు!ఇరవై ఏళ్ల అరుంధతి అరవై ఏళ్ల అనుభవం సంపాదించింది. ఇప్పుడు అరుంధతి అనుభవజ్ఞురాలు.

గతం ప్రసాదించిన అనుభవంతో వర్తమానంలోని రాబోయే అనుభవా లకు సమన్వయం ఏర్పరుచుకుంటూంది మనసులోనే.

విధితో మరోమారు పోరాడటమా? గెలవగలదా? తన అనుభవం ఓటమి



నీకు తప్పదని హెచ్చరిస్తూంది! కాని. . . కాని. . . మనసు—మరో మారు ప్రయత్నించి చూడు, ఈ సారి అయినా నువ్వు గెలవకూడదా అంటూంది.

అరుంధతి ఆలోచనలతో సతమత మవుతూంది. కిటికీ దగ్గిర నిలబడి రోడ్డుమీదికి చూస్తూంది.

ఫిబ్రవరి నెలే అయినా ఎండ నిప్పులు చెరుగుతూంది. రయ్యిన వీస్తూన్న గాలి సుడులు తిరుగుతూ రోడ్‌మీద దుమ్ము ఎగరకొడుతూంది. రోడ్‌మీద కూలీలు పక్కగా ఉన్న సిమెంట్‌రోడ్‌ని డ్రెయినేజి

**కష్టాలు మనిషికోసం కాచుకొని ఉంటాయి. మనసు ఉన్న ప్రాణి కనకనే సుఖదుఃఖాలకు లోనవుతాడు మనిషి. కష్ట పరంపరలో చిక్కుకొన్నప్పుడు, ఆవలి తీరం కనుపించనప్పుడు ధైర్యం నశిస్తుంది. నైరాశ్యం ఆవహిస్తుంది. బ్రతికి ఉండి ప్రయోజనం లేదనిపిస్తుంది. ఎంతటి సహజ పరిణామమైనా గుండె చిక్కబట్టుకొనక తప్పదు. మార్పు రాక మానదు.**

పేరుతో గోతులు తీస్తున్నారు, పగలకొట్టి.

పలుగు దెబ్బకి ఖంగ్ ఖంగ్ మంటూంది రోడ్డు.

అరుంధతి లేతగుండెలమీద అంతకంటే బలమైన దెబ్బలే వేసింది విధి!

గోతిలోని మట్టిని తవ్వి తట్టలతో గుట్టగా పోస్తున్నారు కూలీలు.

అరుంధతి మనసు గతాన్ని తవ్వి చూస్తూంది. కిటికీ ఊచలు పట్టుకుని నిలబడ్డ అరుంధతి మనసు గతాన్ని తెరిచి చూస్తూంది.

రోడ్‌మీద కూలీలు మట్టి తవ్వి గుట్టమీదకు విసురుతున్నారు. చెదరి దూరంగా పడుతూంది మట్టి.

* * *

"అరూ! నువ్వు నవ్వితే ఈ లోకమంతా వెన్నెలతో నిండిపోయినట్లుంటుంది" అన్నాడు శేఖరం అరమోడ్పు కనులతో ఆమెనే చూస్తూ.

"ఇంకా నయం! పొగడటానికి నా నవ్వే దొరికిందా?" అంది అరుంధతి మరోమారు నవ్వి.

శేఖర్ క్షణంపాటు ఆమె వైపు చూస్తూ ఉండిపోయాడు. "అరూ! నీలో అందంగా లేనిదేది? నీ విశాలమైన కళ్ళు, చిలిపితనం చిగురులు వేసే నీ ముక్కు, నవ్వి నా మనసు దోచే పెదవులు, నవ్వినప్పుడు సొట్టలు పడి నా గుండె లోతుల్లో మధురవీణలు మ్రోగించే నీ చెక్కిళ్ళు, సంగీత స్వరాలాలపించినట్లుండే నీ మాటలు—నీలో అణువణువూ అందమైనది, అరూ!" శేఖర్ తన్మయత్వంగా అన్నాడు.

"శేఖర్! ఈ రోజు కాస్త తాగారా? కవిత్వాలూ, భావగీతికలూ వస్తున్నాయి తమరి నోటినుండి" అంది అరుంధతి, చిలిపితనానికి మారుపేరనిపించుకొన్న అరుంధతి.

"నీ సమక్షమే నాకు అమృతం త్రాగిన శక్తి ప్రసాదిస్తుంది, అరూ! నీతో ఇలా మాట్లాడుతూ, నిన్నిలా చూస్తూ ఎన్ని యుగాలైనా ఉండగలను అంటే అది ఆ అమృతం ప్రసాదించిన శక్తి కాదూ?" అడిగాడు శేఖర్ ఆమె కళ్ళలోకి చూస్తూ.

"మిస్టర్ శేఖర్! ఏమిటీ వెర్రి?"

"వెర్రికాదు, అరూ? నిజం! నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను! నన్ను కాదనకు, అరూ! మనం పెళ్ళి చేసుకొందాం" అన్నాడు శేఖర్, ఆవేశంగా ఆమె మృదుహస్తాన్ని తన చేతిలోకి తీసుకొంటూ.

"శేఖర్! ఆ మాటలు మనస్ఫూర్తిగా అంటున్నవేనా?" అడిగింది అరుంధతి, అతని చేతినుండి తన చేతిని సున్నితంగా విడిపించుకోబోతూ.

శేఖర్ ఆమె చెయ్యి వదల్లేదు. మరింత గట్టిగా పట్టుకొన్నాడు. ఆమె చెయ్యి తన గుండెలకేసి అదుముకొని, "అరూ! విను. నా గుండెల శబ్దంలో కూడా నీ పేరే వినిపిస్తుంది!" అన్నాడు ఆవేశంగా.

అరుంధతి జవాబివ్వలేదు! నవ్వి ఊరుకొంది. శేఖర్‌ని గురించి కాలేజీలో ఎటువంటి చెడుప్రచారాలు లేవు. మంచివాడనీ, ఆడపిల్లల వైపు చూడడనీ, ప్రవరాఖ్యుడనీ ఏడిపించేవారు తన క్లాస్‌మేట్లు. అటువంటి శేఖర్ తనని ప్రేమించాడు; పెళ్ళి చేసుకొంటానంటున్నాడు. అంగీకరించడమే మంచిదేమో? నాన్నకీ కొంత భారం తగ్గుతుందిగా? శేఖర్‌ని కాదని ఎవర్నో చేసుకుంటే నాన్న కట్నం ఎక్కడ తేగలడు? తనకి కట్నం ఇచ్చి పెళ్ళి చేయలేక కాలేజీలో చేర్పించాడు. ఆ సంగతి తెలిసే తనూ శ్రద్ధగా చదివేది. కనీసం బాగా చదివి ఏదైనా ఉద్యోగం చూసుకొన్నా కొంత భారం తగ్గుతుందని తన ఊహ. కాని ఏ నాటికయినా ఆడపిల్లకి పెళ్ళి కావలిసిందేననే సంఘంలో ఉంది తను. తను ఉద్యోగం చేస్తుంటేకన్నా పెళ్ళి చేసుకొంటేనే తల్లితండ్రులు ఆనందించగలరేమో?

"నువ్వు నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకొంటే మా తల్లితండ్రులతో మాట్లాడవచ్చుగా?" అడిగింది అరుంధతి ఒక నిశ్చయానికి వచ్చి.

"అంటే. . . అంటే. . . నీకు అభ్యంతరం లేదనేగా? తప్పకుండా మాట్లాడతాను, అరూ! రేపే వస్తాను; కాదు, కాలేజీనుండి కలిసే వెడదాం! సరేనా?" శేఖర్ ఏం మాట్లాడుతున్నాడో అతనికే తెలియడం లేదు. అరుంధతి అంగీకారం అతణ్ణి ఆనంద సాగరంలో మునకలు వేయిస్తూంది.

అంతే! ఆటు తరవాత పెద్దలందరి అంగీకారంతో నెల రోజులలో ముహూర్తాలు నిర్ణయించు కొన్నారు. అరుంధతి మనసులో మునుపు ఎటువంటి భావమూ శేఖర్‌పట్ల లేకపోయినా ఇప్పుడప్పుడే అతని రూపు ఆమె ఎదలో చోటు చేసుకొంటూంది.

అదేసమయంలో విధి ఆమెజీవితంతో మొదటిసారిగా ఆట ప్రారంభించింది. ఎప్పుడూ అన్నింటినీ చిరునవ్వుతో సహించే అరుంధతి చిరునవ్వుతోనే విధితో ఎదురు ఆడబోయింది.

స్వయంగా కారుమీద స్నేహితులందరికీ శుభలేఖలు ఇచ్చి వస్తూన్న శేఖర్‌ని విధి తన విజయానికి సూచనగా ఈ లోకంనుండి తీసుకుపోయింది. ఆక్సిడెంట్‌లో శేఖర్ మరణించటంతో విధి ముందు అరుంధతి ఓడిపోక తప్పలేదు!

అప్పుడే అరుంధతి మొదటిసారిగా, మొట్టమొదటిసారిగా నిర్లిప్తంగా నవ్వటం నేర్చుకొంది!

అరుంధతి మనసులో శేఖర్ మరణం పెద్దగా గాయం చేయలేదు! కాని ఆమె తల్లితండ్రులు మాత్రం తేరుకోలేనంతగా ఎదురుదెబ్బ తిన్నారు. అంతవరకూ ఏదో అనుమానంగా మాత్రమే ఉంటూ వచ్చిన ఏదో అస్పష్టమైన నిజం నగ్నసత్యమై పోయినట్లు బాధపడేవారు. తల్లితండ్రులకు, తనకు కాస్త మార్పుగా ఉంటుందని తండ్రిని పోరి మరో ఊరికి బదిలీ చేయించుకోమంది. ఊరు మారారు. పరిసరాలూ, మనుష్యులూ మారారు.

తేరుకొంటూన్న అరుంధతి జీవితంలోకి అకస్మాత్తుగా ప్రవేశించాడు సుధాకరం. అతను ఎలా పరిచయమైనా, సుధాకరం అరుంధతి మనసులో శేఖర్‌కంటే బాగా చోటు చేసుకోగలిగాడు.

శేఖర్ స్మృతిని మరిచిపోయేందుకు అతనితో ఎక్కువగా కాలం గడిపేది అరుంధతి.

"అరుంధతీ, మీరు నవ్వితే అరవిందాలు విరబూసినట్లుంటుంది. సదా మీ నవ్వు చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. నాకా అవకాశం ఇవ్వరూ?" ప్రాధేయంగా అడిగాడు ఒకనాడు.

అరుంధతి ఈసారి నవ్వలేదు. అతను ఆమె నవ్వుని పొగిడినప్పుడు మరోమారు నవ్వి, చిలిపిగా జవాబిచ్చి పరిహసించేది. ఈసారి అలా నవ్వనూ లేదు. అతణ్ణి పరిహసించనూ లేదు.

"అరుంధతీ! నేను మనస్ఫూర్తిగా అంటున్నా నీ మాటలు! నా గుండెల శబ్దంలో మీ పేరు ఎప్పుడూ దొర్లుతూ ఉంటుంది" అన్నాడు సుధాకరం.

ఔను! కొద్ది తేడాతో శేఖర్ ఇదే అన్నాడు ఆ నాడు. ఆ నాడు తను ఆలోచించలేదు. తల్లితండ్రులతో మాట్లాడమంది. ఈ నాడు ముందు తను ఆలోచించుకోవాలి!

"నన్ను ఆలోచించుకోనివ్వండి" అని మాత్రమే అంది ముక్తసరిగా.


"ఆలోచించుకోండి, అరుంధతీ! తొందరపడవద్దు! పెళ్ళి అనేది ఇరువురి జీవితాల అనుబంధపు విషయం. ఆషామాషీ కాదు! పదండి, పోదాం, పొద్దు పోతూంది" అన్నాడతను, లేచి ఆలోచనలో పడిన తనను చెయ్యి అందించి లేవదీస్తూ.

ఇంటికి వచ్చిన అరుంధతి మంచంమీద వాలి పాలనురుగులాంటి వెన్నెలను చూస్తూ ఆలోచనలో మునిగిపోయింది.

సుధాకరానికి నిజం చెప్పడం మంచిదేమో? చెబితే వెనక్కి తగ్గవచ్చు! తరవాత అయినా తెలియదా? సుధాకరం అంటే తనకీ ఆకర్షణ ఏర్పడ్డది.

ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండే అతని సాన్నిధ్యంలో తనని గత స్మృతులు ఏమీ చేయలే వనిపించేది. కోరివస్తూన్న అతని సాన్నిధ్యాన్ని వదులుకొని తను పొందగలిగేది అశాంతి తప్ప మరొకటేముంది? చివరికి ఎటూ నిర్ణయించుకోలేక తండ్రితో అంతా వివరంగా చెప్పింది అరుంధతి.

ఆమె చెప్పింది విని ఆయన ఏమీ అనలేదు. ఎంతో ఆనందిస్తాడని, తనని ప్రోత్సహిస్తాడని ఆశించిన అరుంధతికి తండ్రి గంభీరత ఆశ్చర్యాన్ని కలిగించింది. అంతేకాదు, ఏదో సందిగ్ధం, అనుమానం ఆయనలో కలిగాయని అరుంధతి చూచాయగా గ్రహించగలిగింది. అయితే ఆ సందిగ్ధం, అనుమానం ఏ విషయంలోనో ఆమెకు అర్థం కాలేదు.




"అసలింతకూ నీ అభిప్రాయం ఏమిటో చెప్పలేదు గదమ్మా?" అడిగాడుతండ్రి, అరుంధతి వైపుచూస్తూ.

అరుంధతి కళ్లు కిందికి వాలిపోయాయి. క్షణకాలం కాలి బొటన వేలితో నేలని రాస్తూ ఉండిపోయింది.

"నాకు ఏ విధంగానైనా ఇష్టమే, నాన్నా!" అనేసి ఇవతలికి వచ్చింది అరుంధతి. ఏ విధంగానైనా అనడంలో, మీకు ఎప్పటికైనా ఈ భారం తగ్గించవలసిన దాన్నేగదా అని కావచ్చు; పాత గాయాన్ని ఈ రూపంగానైనా మరిచిపోవచ్చనీ కావచ్చు; సుధాకరాన్ని నేనూ ప్రేమిస్తున్నాననీ కావచ్చు! ఆమె భావాలన్నీ గ్రహించగలిగిన తండ్రి భారంగా నిట్టూర్చుస్తూ ఉండిపోయాడు.

'పోనీ, మరోమారు ప్రయత్నించి చూద్దాం! దాని అదృష్ట మెలాఉందో?' అనుకొన్నాడు మనసులోనే.

సుధాకరానికి నా అనే వారెవరూ లేకపోవడంతో సంప్రదింపుల అవసరం లేకపోయింది. ఎటువంటి ఆడంబరమూ లేకుండా పెళ్లి జరగాలని అరుంధతి కోరడంతో సుధాకరం అంగీకరించాడు.

శుభలేఖలూ లేవు, ఆహూతులూ లేరు. అరుంధతి వివాహం ఒక రోజుంది. ఆ రోజు కోసం అరుంధతి వెయ్యి కళ్లతో ఎదురుచూచింది. ఆ రోజు రానే వచ్చింది.

ముహూర్తం దగ్గిర పడుతున్న కొద్దీ అరుంధతి గుండెలు ఒక వైపు మధుర భావావేశంతోనూ, మరోవైపు ఏదో అస్పష్టమైన భయంతోనూ దడదడలాడాయి. అరుంధతి మనసు చల్లబడేలా, తల్లితండ్రుల మనసుల్లో కోటి దీపాలు వెలిగేలా కుమారి అరుంధతి శ్రీమతి అరుంధతి అయింది.

అరుంధతీ నక్షత్రాన్ని చూపడానికి పందిట్లోకి తీసుకువచ్చాడు పురోహితుడు.

"అదిగో! మంచంకోళ్లలా నాలుగు నక్షత్రాలు కనిపిస్తున్నాయా! వాటి కింద విల్లులా వంగినట్టున్న మూడు నక్షత్రాలు కనిపిస్తున్నాయా?" అడిగాడు పురోహితుడు వధూవరుల్ని. ఇద్దరూ తల లూపారు. "ఆ ఏడూ సప్తర్షిమండలం."

"ఆ మూడు నక్షత్రాల మధ్యలో ఉన్న నక్షత్రానికి కొంచెం కిందుగా కొద్దిగా ప్రకాశిస్తూ ఉన్నదే అరుంధతీ నక్షత్రం! కనిపిస్తూందా?" అడిగాడు పురోహితుడు, తన చేత్తోనే చూపించేటంత దగ్గిర్లోనే ఉన్నట్టు చెయ్యి చాపి.

"కనిపిస్తూంది" అంది చిన్నగా అరుంధతి.

అస్పష్టంగా కనిపించే ఆ నక్షత్రాన్ని సరిగా పోల్చుకోలేక, కనపడలేదంటే ఏ దృష్టి దోషమో అనుకొంటారని కనిపిస్తూందని తల ఊపడం కూడా అరుంధతీ నక్షత్రాన్ని చూపించడం వంటి ఆచారంతో కలిసిపోయింది.

"నాకు కనిపించడం లేదు!" అనేశాడు సుధాకరం.

అరుంధతికి అప్పుడే ఎక్కడో పేలిన దీపావళి టపాకాయ తన గుండెల్లోనే పేలినట్లనిపించింది. అతని వైపు అందరూ విచిత్రంగా చూశారు. అంతవరకూ కాస్త నిశ్చింతమైన ముగ్గురి మనసుల్లో తిరిగి ఆందోళన చోటు చేసుకొంది.

ఏ కారణంచేతనో వివాహమైన పది రోజులదాకా శోభనముహూర్తం నిర్ణయించుకోలేదు. ఆ పది రోజుల లోనూ ప్రతిరాత్రి మధురభావాలతో మనసులు మరింతగా పైన వేసుకుపోగా నిశ్చింతగా, ప్రపంచంలో సుధాకరం అండతప్ప ఇంకేమీ వద్దనే భావంతో నిర్మలంగా ఉండగలిగింది అరుంధతి.

తొమ్మిదోనాడు రాత్రి అందర్నీ నవ్వించి, తను నవ్వి నిద్రపోయిన సుధాకరం మరునాడు ఉదయం మామూలుగా లేవలేకపోయాడు. కాసేపట్లోనే జ్వరం అని నిర్ణయించుకొని డాక్టర్ని పిలుచుకు వచ్చారు. ఇంజక్షన్ ఇచ్చి గంట గంటకూ మందు వేయమని చెప్పి వెళ్లాడు. గంటగంటకూ మందులూ, మాత్రలూ వాడుతూ అతని మంచం పక్కనే కూర్చుండిపోయింది అరుంధతి. రాను రాను జ్వరం తీవ్రమయిందేకాని తగ్గలేదు. కాలం అరుంధతిని గురించి ఆలోచించలేదు. సాగిపోతూనే ఉంది. చీకటి పడింది.

నవ్వులూ, కేరింతాలూ, మంత్రాల మధ్య శోభనానికి ఏర్పాట్లు చేయవలసిన ఆ ఇంట్లో నిట్టూర్పులూ, దీర్ఘనిశ్వాసాలూ మధ్య విషాదం చోటు చేసుకొంది.

తన మృదుహాస్తాలతో, సిగ్గుతెరల మధ్య శోభనం గదిలో అతని నోటికి ఏ తీపిపదార్థమో అందించవలసిన అరుంధతి వణుకుతున్న చేత్తో, కన్నీటి పొరలమధ్య మృత్యుమందిరంలా ఉన్న ఆ గదిలో చెంచాతో అతని నోట్లో మందు పోస్తూంది!

మనసులు కలిసిన ఇరువురి తనువులూ కలియవలసిన ఆ రాత్రి ఇద్దరి మానసిక బంధాలనూ తెంచి, తనువులనూ దూరంగా చేసింది.

అరుంధతిని చిలిపిచేష్టలతో నవ్వించి, కవ్వించి అలసి అరుంధతి వెచ్చని కౌగిలిలో సొమ్మసిల్లి నిద్రపోవలిసిన సుధాకరం మృత్యువుతో పోరాడి, అలసి శాశ్వతంగా మృత్యుదేవత చల్లని కౌగిలిలో నిద్రపోయాడు.

విధి మరోసారి అరుంధతి జీవితంలో ఆడుకొంది. గెలిచింది! అరుంధతికి ఓడిపోవడం ఇది రెండవ సారి! ఒకసారి పరాజయం పొందినవారికి రెండవసారి బాధ అనిపించకపోవచ్చు.

కాని అరుంధతి హృదయం ముక్కలయిం దీసారి మాత్రమే!

శేఖర్ని తను ప్రేమించలేదు. తల్లితండ్రుల భారం తగ్గించడానికి కావాలని కోరి వచ్చిన అతణ్ని చేసుకొనేందుకు సిద్ధపడింది. అరుంధతి ఇష్టపడినా, విధి కాదంది!

సుధాకరాన్ని ప్రేమించిందో లేదో తనకే సరిగా తెలియదు. కాని అతని సమక్షం కావాలనుకొంది. ఇద్దర్నీ ఒక బంధంతో ముడివేసి, మరీ విడదీసింది విధి!

శేఖర్ విషయంలో తను భంగపడినా, తొందరగానే తేరుకొంది. సుధాకరం విషయంలో అరుంధతి తేరుకోలేకపోయింది.

విశాలమైన ఆమె నల్లని కళ్లలో మరి కారిపోయేందుకు కన్నీరు లేక, ఎండిపోయిన చెరువు బీటలు వేసినట్లు ఆమె కంటికింద నల్లని చారలు ఏర్పడ్డాయి.

నవ్వినప్పుడు సొట్టలు పడే బుగ్గలు చిక్కి ఇప్పుడు నవ్వకపోయినా సొట్టలుగానే నిలిచిపోయాయి. సంగీత స్వరాలాలపించినట్లుండే ఆమె మాటలు—ఇప్పుడు కరువయిపోయాయి.

వివాహమయినా కన్యగా నిలిచిపోయిన అరుంధతి అతి తేలికగా కాలం గడపటం నేర్చుకొంది. తన వ్యధ మరిచిపోవడానికి, తల్లితండ్రుల బాధ మాన్పడానికి ఉద్యోగంలో ప్రవేశించింది.

ఆమె నుదుటి అరుణతిలకాన్ని ఒకప్పుడు ఆమె ముంగురులు పరామర్శించేవి. ఇప్పుడు వాటికి అక్కడేమీ కనిపించడం లేదు కాబోలు, నిశ్చలంగా ఉండిపోయాయి.

ఏ చీరె కట్టినా అరుంధతి ఆ చీరెకు అందమిచ్చేదనే వా రందరూ. ఇప్పుడు అరుంధతి ఎన్నో చీరెలు కట్టడంలేదు. ఒక్క తెల్లచీరెలు తప్ప! అరుంధతి నడక హంసగమనంలా ఉండేది ఒకప్పుడు. ఇప్పుడు ఒక్కో అడుగూ భారంగా తూచివేస్తూ నడవటం నేర్చుకొంది.

ఒక రకమైన జీవితానికి అలవాటు పడ్డ అరుంధతిని విధి ఊరికే ఉండనివ్వలేదు. మరోసారి ఆటకు పిలిచింది.

అరుంధతి పనిచేసే ఆఫీసులోనే పనిచేసే మోహనరావు అరుంధతిని ఒక ప్రత్యేకమైన భావంతో గౌరవించేవాడు. నుదుట తిలకం లేని అరుంధతిని అందరూ అదో రకమైన తేలికభావంతో చూస్తే, మోహనరావు మాత్రం ఎంతో గౌరవభావంతో ప్రవర్తించేవాడు ఆమె పట్ల.

అరుంధతి ఎవరినీ లెక్కచేసేది కాదు; ఎవరితోనూ మాట్లాడేది కాదు. తన పనేమో, తానేమో — అంతే!

ఆమె *గంభీరతా*, ఎవ రే విధంగా అన్నా చలించని ఆమె నిశ్చలతా మోహనరావుని ఆకర్షించాయి. ఫలితంగా ఒక నాడు ఇంటికి బయలుదేరిన ఆమెకూడా వచ్చి, "అరుంధతీ, మీతో చాలా కాలంగా ఒక విషయం మాట్లాడాలనుకొంటున్నాను. దయచేసి నాతో ఒక్క అయిదు నిమిషాల సేపు పార్కులో కూర్చోండి" అన్నాడు ప్రాధేయపడుతూ.

అరుంధతి అదురుతున్న గుండెలతో, బెదురుతున్న కళ్లతో అతని వైపు చూసింది. "నన్ను అపార్థం చేసుకోకండి, అరుంధతీ! మీ పట్ల నాకు గౌరవభావమే తప్ప మరే దురుద్దేశమూ లేదు" అన్నా డతను, ఆమె కళ్లలోని సందేహాన్ని మరో విధంగా అర్థం చేసుకొని.

అరుంధతి మౌనంగా పార్కువైపు నడిచింది. ఇద్దరూ మూలగా ఎడంగా కూర్చున్నారు. పగలల్లా లోకమంతా తిరిగి అలిసిపోయిన సూర్యుడు పడమర వైపు తొందరగా పరుగులు తీస్తున్నాడు.

"అరుంధతీ! ఏవో ఉపోద్ఘాతాలు చెప్పడం అనవసరం. సూటిగా నా మనసులోనివిషయాన్నిచెప్పాలనుకొంటున్నాను" అని క్షణ మాగి, "నన్ను పెళ్లి చేసుకొనేందుకు మీ కేమయినా అభ్యంతరమా?" అని అడిగాడు నిశ్చలమైన కంఠంతో.

అతను అటువంటి ప్రస్తావన కోసమే పార్కుకి రమ్మన్నాడని గ్రహించినా, అతనంత సూటిగా అడుగుతాడని అనుకోని అరుంధతి క్షణంపాటు కంపించింది.

"నా సంగతి మీకు పూర్తిగా తెలియదు, మోహనరావుగారూ! తెలిసి ఉంటే మీరు ఏదో ఆశలు పెంచుకొనే వారు కాదేమో?" అరుంధతి కంఠం వణికింది అప్రయత్నంగానే.

"మీ గురించి నే నేం తెలుసుకోవాలి? మీరు వివాహితురాలని , భర్తృవిహీనురాలనీ నాకే కాదు,అందరికీ తెలుసు!" అన్నా డతను నవ్వి.

అరుంధతి కాదన్నట్లు తల ఊపింది. మోహనరావు ఆమెవైపు విచిత్రంగా చూశాడు. అరుంధతి మొదటినుండీ అంతా వివరంగా చెప్పింది. ఏదీ దాచ లేదు.

"ఇప్పుడు చెప్పండి, మోహన్! నేను దైవోపహతురాల్ని. తుమ్మెద చేర లేని పుష్పాన్ని. నన్ను ఆశించకండి. . .!" అరుంధతి కంఠం పూడుకుపోతూంది.

"లేదు, అరుంధతీ! దైవం మిమ్మల్ని పరీక్షించాడు. అంతే! నేనూ మీ లాగే జీవితంలో దెబ్బతిన్నవాడినే! ప్రాణంలా ప్రేమించిన నా సరోజ నన్ను, నాకు తోడుగా ఒక పాపను వదిలి వెళ్లిపోయింది. నా కోసం కాదు మిమ్మల్ని నా జీవితంలో అడుగుపెట్టమంటూన్నది. పాపకోసం! అమ్మ కోసం అలమటించే నా పాప కోసం, అరుంధతీ! ఇద్దరం జీవితంలో దెబ్బలుతిన్నవాళ్లమే!అందుకే ఇద్దరం ఒక టవుదామంటున్నాను." మోహనరావు శూన్యంలోకి చూస్తూ అన్నాడు.

తన జీవితం గురించి అంతా విన్న తరవాతకూడా అతను తన నిశ్చయాన్ని మార్చుకోలేదు. తనకు అతనిమీద మోహం లేదు; అటువంటి దేదయినా ఉంటే సుధాకరం మరణంతోనే అదీ అంతరించిపోయింది. . . అతనూ తనను కోరుతున్నది కేవలం తన పాప కోసం! అంగీకరిస్తే?...

"రేపు ఉదయం మా ఇంటికి రండి. నా నిర్ణయం చెపుతాను. మా పెద్దవాళ్లని చూచినట్లూ ఉంటుంది. కాని ఒక్క విషయం. . ." ఆగిపోయింది అరుంధతి.

"సందేహించకండి, అరుంధతీ! చెప్పండి. నేనూ ఒక విషయం చెప్ప దలుచుకొన్నాను. మీ పరిస్థితిపట్ల పే దుభావంతోగాని, జాలితోగాని మిమ్మల్ని నా జీవితంలో ప్రవేశించమని అడగటం లేదు. నా పాపను అమృత హృదయంతో పెంచగలరనీ, దానికి తల్లి లేని లోటు తీర్చగలరనీ నమ్మకంతో, విశ్వాసంతో మిమ్మల్ని అడిగాను. మీకు ఏమైనా నా విషయంలో సందేహం కలిగితే చెప్పండి! ముందే తెలుసుకోవడం మంచిది."

అరుంధతి అతనివైపు పరీక్షగా చూసింది, అత నా మాటలు మనస్ఫూర్తిగా అంటున్నాడా, లేదా అని ఆలోచిస్తూ.

"ఒకవేళ నేను అంగీకరించకపోయినా బాధపడరుగదా!" అడిగింది ఆలోచిస్తూ.

"బాధపడను. కాని ఒక్క విషయం గుర్తుంచుకోండి! నన్ను ఒక స్నేహితుడుగానైనా స్వీకరించండి, కనీసం ఒకరి బాధలు ఒకరికైనా చెప్పుకోవచ్చు."

అరుంధతి కంఠం అవ్యక్తంగా పూడుకుపోయింది. మాట్లాడలేక సరే అన్నట్లు తల ఊపి లేచి నిలబడింది పోదామన్నట్లు.



ముక్కంటి

చిత్రం — బి. బలిజ (వరంగల్లు)

"రిక్షాలో వెళ్లండి, అరుంధతీ! పొద్దుపోయింది. నేను వెడతాను, పాప నా కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. గుడ్‌నైట్." ఆమె కోసం రిక్షాని కేకేస్తూ అన్నా డతను.

"గుడ్‌నైట్" అనేసి అరుంధతి రిక్షా ఎక్కింది.

తన కలలూ,ఆశలూ, కోరికలూ నశించాయి. మోహనరావుని తన నా దృష్టితో చూడలేదు. కోరుకోవడం లేదు. కేవలం పాప కోసం! తల్లిలేని ఆ చిన్నారి కోసం! ఆ పాపను చూసుకొంటూ తనూ అన్నీ మరిచిపోవచ్చు. అంగీకరించడం మంచిదేమో?

ఆలోచిస్తూ నిశ్శబ్దంగా రిక్షా దిగి ఇంట్లోకి అడుగు పెట్టబోయిన అరుంధతి ఆగిపోయింది!

"అమ్మాయి ఇంకా రాలేదేమండీ!" అడుగుతూంది తల్లి.

"ఆఫీసులో ఏదో ఆలస్యమయి ఉంటుంది. ఇంటికి వచ్చి మాత్రం ఏం చేస్తుంది?" గాఢంగా నిట్టూరుస్తూ అంటున్నాడు తండ్రి.

"దాని బతుకలా తెల్లవారి పోవలిసిందేనా?"

"ఎందు కలా ఏడుస్తావు? మనం చేయగలిగింది లేదు. దానికి భర్తృయోగం లేదని, తాళికట్టిన వా డెవడూ జీవించడని చిన్నప్పుడు జాతకాలు చూపించినప్పుడే చెప్పారు. నమ్మకం, నమ్మలేక ఇద్దరి జీవితాలని దాని కోసం బలి చేశాము. చూస్తూ, చూస్తూ రెండు సార్లు అనుభవమయికూడా మరొకరి ప్రాణాలు ఎలా బలి తీసుకోగలము? దాని రాత అలా ఉంది! ఊరుకో!. ఏడ్చి ప్రయోజనం లేదు."

తండ్రి మాటలు ఇక వినిపించలేదు అరుంధతికి. క్షణ కాలం తానెక్కడున్నదీ మరిచిపోయింది. కళ్లు తిరిగి పడిపోయిన అరుంధతి తలుపులు పట్టుకొని నిలదొక్కుకొంది. కళ్లు తిరిగిపోతున్నాయి. ఒంట్లో ఎప్పుడూ లేని నీరసం ఆవరించింది. మరో అడుగు వేయబోయిన అరుంధతి తూలి ముందుకు పడిపోయింది. ఆ చప్పుడు విని తల్లీ, తండ్రీ పరిగెత్తుకు వచ్చారు.

లేవదీయబోతూన్న తల్లిని చుట్టేసి బావురుమంది అరుంధతి.

"అమ్మా! నాకు ఇంత కాలం ఈ సంగతి ఎందుకు చెప్పలేదమ్మా? ఈ సంగతి ముందుగా తెలిసి ఉంటే రెండు ప్రాణాలు బలి తీసుకునేదాన్ని కానుగా? నన్ను ప్రేమించి, నా మీద

ఎన్నో ఆశలు పెట్టుకొన్న ఆ ఇద్దరూ నా మూలంగానే ప్రాణాలు పోగొట్టుకొన్నారా? ఇది నిజమేనా, నాన్నా! మీరైనా చెప్పండి! చెప్పండి, నాన్నా! దాచకండి! నేనీ బాధ భరించలేను.'' తల్లి గుండెలకేసి తల బాదుకుంటూంది అరుంధతి.

అరుంధతి కన్నీరు కార్చి ఎంతో కాలమైంది. రెండు కాలాలపాటు నిలవ ఉండిపోయిన వర్షమంతా వానాకాలంలో మొదటి వర్షంనాడు కుంభపోతగా కురిసినట్లు అరుంధతి కళ్లలోని నీరు కాలవలు కడుతూంది.

''నిజమే, తల్లీ! అయితే ఏ తండ్రి మాత్రం కన్నబిడ్డతో అటువంటి విషయం చెప్పగలడు? చెప్పి నీ లోని ఆశలను ఎలా తుంచేయనమ్మా? ఏ నాడో నేను చేసిన పాపం ఈ నాడు నిన్ను ఏడిపిస్తూందమ్మా! అంతే! కాకపోతే అభమూ, శుభమూ ఎరగని నీకు ఈ వయసులో ఈ దుఃఖం, అందునా ఇటువంటి రంపపుకోత ఏమిటి తల్లీ! నీ కోసం నేనేమీ చేయలేక పోతున్నానమ్మా! అదే నా బాధ.'' ఆ పితృహృదయంలో ఎంతో కాలంగా దాచుకొన్న అగ్నిగుండం ఆవేదన రూపంలో బయటకు ఉరకలు వేస్తూంది.

''ఇంకేమీ చేయవద్దు, నాన్నా! చేసింది చాలు, నన్నిలా బతకనివ్వండి.'' అరుంధతి ఆవేదన పట్టలేక, గుండెలు కోతవేసే దుఃఖాన్ని భరించలేక తల్లి హృదయంమీదనే స్పృహ తప్పి వాలి పోయింది.

• • •

భళ్లున తెల్లవారింది.

మోహనరావు అరుంధతి ఇంటికి వచ్చేసరికి ఏడు గంటలు దాటుతూంది.

ఆదరంతో స్వాగతం లభించవలసిన అరుంధతి ఇంటినుండి అతనికి శోక గీతికలు స్వాగతగీతా లయినాయి.

వసారాలో నిర్జీవంగా పడి ఉంది అరుంధతి.

ఇరవైఏళ్ల అరుంధతి అరవైఏళ్ల అనుభవం సంపాదించి నూరేళ్లు నిండిన దానిలా మరిక ఈ లోకంతో పని లేనట్లు నిష్క్రమించింది.

అరుంధతి భౌతికకాయం మీద పడి విలపిస్తున్నారు తల్లీ, తండ్రీ. మోహనరావు గుండెల నెవరో నలిపినట్లయింది. ఏమయింది అరుంధతికి?

''అరుంధతి ఆత్మహత్య చేసుకొంది'' అంటున్నా రెవరో!

'అరుంధతి ఆత్మహత్య చేసుకొందా? అవసరమేమిటి? అరుంధతీ,ఎందు కంత తొందరపడ్డావు? ఆత్మహత్య చేసుకోవలసినటువంటి ఆపదే కలిగినట్లయితే నాతో ఒక్క మాట చెప్పకూడదా? ఒక ఆత్మీయుడుగా కాకపోయినా, ఒక స్నేహితుడుగానైనా సంతోషంగా చేసి ఉండేవాడినిగదా?'

పొంగివస్తూన్న దుఃఖాన్ని దిగ మింగుతూ, ''మీ రేనా మోహనరావు గారంటే?'' అనిఅడిగాడు అరుంధతి తండ్రి. మోహనరావు తల ఊపాడు.

''ఇదిగో, ఈ ఉత్తరం మీ కని వ్రాసింది.'' బనీను జేబులోనుండి మడత పెట్టిన కాగితం తీసి అందించాడు. 'అరుంధతి తనకు ఉత్తరం వ్రాసిందా? అంతటి చనువూ, స్నేహమూ తమ మధ్య లేవే?' వణుకుతూన్న చేతులతో ఉత్తరం విప్పాడు మోహనరావు.

''మోహనరావుగారూ!

అరుంధతి అంతిమ నమస్కారాలు!

క్షమించండి, ముంది అభాగ్యవతి అరుంధతిని!

సుధాకరం మరణంతోనే నాలో ఆశలు నశించాయి. పెళ్లి చేసుకోవాలనీ సుఖపడాలనీ కోరుకోలేదు.

అసలు నాలో ఏవిధమైన కోరికలూ కలిగేవి కావు. కాని బ్రతకాలనే కోరిక మాత్రం ఉండేది. అది ఎందుకో, ఏం సాధించాలనో అనిపించేది అప్పుడప్పుడూ.

నిన్న మీరు మన వివాహప్రస్తావన తెస్తే నేను మొదట అంగీకరించ దలచలేదు. కాని పాప విషయం విన్నాక, కనీసం పాపను పెంచే తల్లిగానైనా కాలం గడుపుదామనుకొన్నాను. నా అంగీకారం పెద్దలమధ్య చెప్పాలని మిమ్మల్ని ఇంటికి ఆహ్వానించాను. కాని నేను అనుకొన్నదొకటి, అయినదొకటి. అయినా అదీ ఒకందుకు మంచిదే ననిపిస్తూంది ఇప్పుడు.

నాకు భర్తృవిహీనయోగం ఉన్నదని నిన్న నా తల్లిదండ్రుల సంభాషణలో గాని తెలియలేదు. జాతకాలూ నమ్మకాలూ ఇవన్నీ బూటకాలనుకొనే నాకు నా జీవితమే ఉదాహరణఅయింది. నా


వయసు ఫోటో—పి. ఎమ్. వరప్రసాదరావు (గుంటూరు—2)

జాతకంలో ఉన్నదని ఎవరో చెప్పినట్లు, అది నిజం కాకుంటే నన్ను ప్రేమించిన శేఖర్, నన్ను పెళ్లి చేసుకున్న సుధాకరం అకస్మాత్తుగా ఎందుకుమరణించినట్లు ?

నేను భర్తృహంతకిని! మోహనరావు గారూ, నేను ప్రియహంతకిని! నన్ను ప్రేమించినవారిని బలి తీసుకొనే పాపిని! నా నీడ తాకితే ఎవరయినా నాశనంకాక తప్పదు! ఈ నిజం తెలియక ఇద్దర్ని పొట్టన పెట్టుకొన్నాను. తెలిసి మరొకర్ని ఎలా బలి తీసుకోగలను?

మీ రన్నట్లు ఇద్దరం విధివంచితు లమే కనక పెళ్లాడి ఉంటే పాపను నా ప్రాణంలా చూసుకొనేదాన్నేమో? కాని నేను పాదం మోపిన చోట, నా నీడ సోకినచోట, నా మనసు ఆకర్షించిన వారు నాశనం కాక తప్పదు. ఇది అనుభవపూర్వక నగ్నసత్యం!

మరోసారి విధి గెలిస్తే మీరూ బలికాక తప్పదు! పాప ఏమవుతుంది? నే నున్నా మీ లోటు పూడ్చగలనా? పాప తల్లిలేనిది కావచ్చు! తండ్రికూడా లేకుండా చేసేందుకు నే నెవర్ని? ఈ విషయం మీతో చెప్పి అంగీకరింప చేయలేక కాదు నేను ఆత్మహత్య చేసుకొంటున్నది!

అరుంధతి అందం అగ్నిలాంటిది. దరి చేరిన వా రందరూ పురుగుల్లా మాడిపోతారు! అది నా కిష్టం లేదు! విధి నాకు అన్యాయం చేసిందనుకొన్నా విన్నాళ్లూ! కాదు, నేనే కొందరికి అన్యాయం చేస్తున్నానని, చేశానని తెలిశాక జీవితం దుర్భరమనిపించింది. అందుకే ఆత్మహత్య చేసుకొంటున్నాను.

మిమ్మల్ని నిరాశపరిచిన ఈ అరుంధతిని క్షమించండి!

విధి నా జీవితంతో రెండు సార్లు ఆడుకొంది! రెండు సార్లూ నేను ఓడిపోయాను. విజయం పొందిన గర్వంతో విధి మరోమారు నా జీవితంతో ఆడుకో చూచింది. కాని ఈ సారి విధికి జయం కలగదు!

అరుంధతి గెలుస్తుంది!

—మీకు ఏమీకాని,

—అరుంధతి.''

''పొరపాటుపడ్డారు, అరుంధతీ! మీరు నాకు ఏమీ కాకపోవటం ఏమిటి? నాకు మీరూ, మీకు నేనూ సర్వస్వం అవుదామనుకొన్నాను. కాని తొందరపడ్డారు! మీ నమ్మకానికి బలైపోయారు!'' మోహనరావు కొనగోట కళ్లలో చిప్పిల్లిన కన్నీరు తుడుచుకొన్నాడు.

ఒక్క క్షణం అరుంధతి వదనం వైపు చూస్తూ ఉండిపోయాడు. చటుక్కున లోపలకు వెళ్లి తిరిగివచ్చాడు. చూపుడువేలూ, బొటనవేలూ మధ్యనున్న కుంకుమను అరుంధతి నుదుట ఉంచాడు. అందరూ అతని వైపు విచిత్రంగా చూశారు.

'అరుంధతీ, మీరు ఓడిపోలేదు. ఈసారి మీరే గెలిచారు' అనుకొన్నాడు మోహనరావు పూడుకుపోతూన్న కంఠంతో.

ఔను, అరుంధతి గెలిచింది! విధి ఈసారి ఓడిపోయింది!

అరుంధతి విజయసూచనగా అంత వరకూ మబ్బు పట్టిన ఆకాశం టపటప చినుకులు వర్షించసాగింది! ★